సాక్షి ఒడిశా

శనివారం, 1, జూలై, 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,12,837లు, బంగారం 33.45 గ్రాములు, వెండి 22.5 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జంట హత్యల కలకలం

- యువకులపై పెట్రోల్ పోసి, నిప్పంటించిన గ్రామస్తులు

- IIలో



పూరీ రత్న భాండాగారారం తెరవాలి

- IIలో

న్యూస్‌రీల్

19క్వింటాళ్లగంజాయి ధ్వంసం



కర్మాగారంలో గంజాయిని అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న 1919.525 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ దగ్ధం చేసింది. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ఈ సమాచారాన్ని తన ట్విట్టర్ ద్వారా శుక్రవారం ప్రకటించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో అల్లాయిస్(ఇంఫా) కర్మాగారంలో గంజాయికి సంబంధిత శాఖ అధికారుల సమక్షంలో నిప్పంటించినట్లు పేర్కొన్నారు. మొత్తం 19 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి అభిరాం బెహరా, అదనపు ఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రొ, ఐఐసీ కమలాకాంత్ కుహూరా తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి బీడీఓగా ప్రవాతి జొడియా



రాయగడ: జిల్లా కేంద్రానికి బీడీఓగా ప్రవాతి జొడియాను నియమిస్తూ రాష్ట్ర ఆర్‌అండ్‌డీఎం శాఖ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రామనగుడ బ్లాక్ అభివృద్ధి అధికారిగా ఉన్న ఆమె.. బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నమే నూతన బీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

జగన్నాథ మందిరానికి విరాళం



విరాళాన్ని అందిస్తున్న ప్రవీణ్‌కుమార్

పర్లాకిమిడి: స్థానిక పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న జగన్నాథ మందిరానికి బి.ప్రవీణ్‌కుమార్ రూ.50 వేలను విరాళంగా అందజేశారు. తన తండ్రి బీఎస్ రావు(ఎస్‌బీఐ అధికారి) జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దుర్గామాధవ్ పాణిగ్రాహికి ఈ మొత్తాన్ని శుక్రవారం అందించారు.

రైతులకు పోషక విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు

జయపురం: సాగులో అధిక ఉత్పత్తి సాధించేలా ప్రొటీన్, జింక్ పోషకాలు కలిగిన వరి విత్తనాలను రైతులకు బొరిగుమ్మ సమితి కార్యాలయంలో అధికారులు శుక్రవారం అందజేశారు. జీవ విజ్ఞాన సంస్థ(భువనేశ్వర్) ఆధ్వర్యంలో బొరిగుమ్మ సమితి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జాతీయ ధాన్య పరిశోధన కేంద్రం(కటక్) శాస్త్రవేత్తలు రూపొందించిన సీఆర్-311, సీఆర్-411 విత్తనాలను బొరిగుమ్మ సమితిలో 12, గ్రామ పంచాయతీలలో 35 మంది రైతులకు 10 కిలోల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ మిషన్ కో-ఆర్డినేటర్ దేవేంద్ర పండా మాట్లాడుతూ వీటితో అధిక ఉత్పత్తులు సాధించడం తోపాటు తిరిగి విత్తనాలను ఉత్పత్తి చేయవచ్చని వెల్లడించారు. హెక్టార్‌లో దాదాపు 5,500 కిలోల ధాన్యం దిగుబడి రావచ్చని తెలిపారు. వీటిని విత్తే విధానంపై రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో బొరిగుమ్మ సమితి వ్యవసాయ విభాగ అధికారి రాజారావు, సమితి విస్తరణ అధికారి గురుబంధు పూజారి, సర్పంచ్ గణేశ్వర నాయక్, గిరిధారి ప్రధాన్ పాల్గొన్నారు.

వన సంకల్పానికి శ్రీకారం



మొక్కకు ట్రీ గార్డ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జయపురం: పట్టణానికి చెందిన అన్నపూర్ణ గ్రీన్ ఫ్రండ్స్ సంస్థ వన మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది 10వేల మొక్కలు నాటేందుకు సంకల్పించింది. ఈ మేరకు జగన్నాథుని బహుడా యాత్ర సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పరేష్ రథ్ తెలిపారు.

అధరం.. మధురం



జగన్నాథుని రథం నందిఘోష్‌పై ఒధొరొ పొణా ఉత్సవం

పూరీ జగన్నాథుని రథయాత్రలో అడుగడుగునా అపురూప ఘట్టాలు ఉత్సవాలుగా తారస పడుతుంటాయి. దాదాపు స్వామి వార్షిక రథయాత్ర ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో శనివారం యథాతథంగా శ్రీమందిరం రత్నవేదిక పైకి దేవతామూర్తులు చేరుకోనున్నారు. అంతకుముందు కృతజ్ఞత పూర్వకంగా యాత్రకు సహకరించిన రథారూఢ పార్శ్వ దేవతలతో అదృశ్య శక్తి స్వరూపాలను సంతృప్తి పరిచేందుకు తియ్యని పాణకం ప్రసాదించడం విశేషం. ఈ ఉత్సవమే ఒధొరొ పొణాగా ప్రతీతి.

– భువనేశ్వర్

- నయన మనోహరంగా ఒధొరొ పొణా ఉత్సవం
- దృశ్య, అదృశ్య శక్తులకు పాణకం సమర్పణ
- నేడు నీలాద్రి విజేకి ప్రత్యేక ఏర్పాట్లు
- రత్నవేదిక పైకి చేరుకోనున్న జగన్నాథుడు

బలభద్ర, సుభద్ర, జగన్నాథ మూర్తుల స్వర్ణాలంకారం పూర్తి కావడంతో రథాల పైనుంచే అత్యంత ఆసక్తికరంగా ఒధొర పొణా ఉత్సవం శుక్రవారం నిర్వహించారు. ఒధొరొ అనగా పెదవి. పొణా అంటే పాణకం. పెదవులను తాకే ఎత్తులో పాణకాన్ని ఏర్పాటు చేయడంతో ఈ ఉత్సవం ఒధొరొ పొణాగా ప్రసిద్ధి చెందింది. ఆషాఢ శుద్ధ ద్వాదశి సందర్భంగా తాళధ్వజం, దర్పదళనం, నందిఘోష్ రథాలపై వేర్వేరుగా 3 చొప్పున తియ్యని పాణకంతో నిండిన బాణలను సిద్ధం చేశారు. ఈ బాణలు మూల విరాట్‌ల పెదవులకు చేరువగా ఉన్న ఎత్తులో ప్రత్యేకంగా తయారు చేస్తారు. స్థానిక కుంభార్‌పాడా కుమ్మరులు అత్యంత నియమ నిష్ఠలతో వీటిని తయారు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ సంప్రదాయం ప్రకారం రథయాత్రలో భాగంగా సింహద్వారం ముంగిట 3 రథాలపై షోడశోపచార పూజాదులతో నిర్వహించారు. ఈ ఉత్సవం సుమారు 450 ఏళ్ల ప్రాచీనమైనదిగా జగన్నాథ తత్త్వ పరిశోధక వర్గాల సమాచారం. ప్రాచీన కాలంలో 12 చొప్పున భారీ బాణలను ఒధొరొ పొణా సేవలో వినియోగించినట్లు తెలిపారు. ప్రత్యేక ఆహార నియమాలతో నెల రోజులు నిరవధికంగా శ్రమించి ఒధొరొ పొణా బాణలను కుంభార్‌పాడా కుమ్మరులు తయారు చేశారు. ఈ ప్రక్రియలో మహిళలకు దూరంగా ఉండటం చారం.



రథాలపైకి పాణకం తరలిస్తున్న సేవకులు

మఠాల భాగస్వామ్యంతో..

జగన్నాథ సంస్కృతితో ముడిపడిన పలు మఠాల సమన్వయం, భాగస్వామ్యంతో ఒధొరొ పొణా ఉత్సవం నిర్వహించారు. రాఘవ్‌దాస్ మఠం, బొడొ ఒడియా మఠం బాణల తయారీకి అనుకూలమైన మట్టి పంపిణీ చేస్తుంది. ఈ మఠాలకు ఆలయ పాలకవర్గం చేయూతగా వ్యవహరిస్తుంది. పాణియా ఒపాలొ సేవకులు సింహద్వారం సమీపంలోని ఛవుణి మఠం దగ్గర ఉన్న బావి నుంచి నీటిని తీసుకు వచ్చి, రథాలపై ముందస్తుగా సిద్ధం చేసిన బాణల్లో లెక్క ప్రకారం పోశారు. సూపకారు వర్గీయులు పాల మీగడ, జున్ను, పంచదార, అరటిపండు, కర్పూరం, జాజికాయ, నల్ల మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో బాణల్లో పోసిన నీటితో పాణకం సిద్ధం చేశారు. బాణలు పాణకంతో సిద్ధం కావడంతో పత్రిబొడు, సురొబొడు, గొరాబొడు పలియా సేవకులతో పూజాపండా సేవకులు మూల విరాట్‌లకు నివేదించారు.

షోడశోపచారాలతో..

రథాలపై కొలువుదీరి పూజలందుకుంటున్న బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథుడు, సుదర్శనునికి శుక్రవారం మధ్యాహ్న ధూప సేవ ముగించి ఒధొరొ పొణా ఉత్సవ సన్నాహాలు ప్రారంభించారు. సన్నాహాలు పూర్తి కావడంతో షోడశోపచార పూజాదులు నిర్వహించి ఒధొరొ పొణా ఉత్సవం నిర్వహించారు.

రేపటి నుంచి..

యాత్ర నిర్వహణ యంత్రాంగం గతంలో జారీ చేసిన ప్రకారం ఒధొరొ పొణా ఉత్సవం వరకు ప్రతి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో నీలాద్రి విజే మహోత్సవానికి భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. మూల విరాట్‌లను శ్రీమందిరం రత్న వేదికపై యథాతథంగా ప్రతిష్ఠించేందుకు ఈ ఉత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవతామూర్తులను రథాలపై నుంచి వరుస క్రమంలో(గొట్టి పొహొండి) నిర్వహించి, సింహద్వారం మీదుగా 7 మెట్ల మార్గం దాటుతూ రత్న వేదికపైకి సురక్షితంగా చేర్చడమే నీలాద్రి విజే. దీంతో వార్షిక రథయాత్రకు తెర పడుతుంది. ఆదివారం నుంచి రత్న వేదికపై మూల విరాట్‌ల దర్శనం నిరవధికంగా లభించనుంది.

అంతా సమానామే..

శుక్రవారం రాత్రి ఒధొరొ పొణా ఉత్సవం విజయవంతం కావడంతో నీలాద్రి విజేకి మార్గం సుగమమైంది. రాత్రి 8.50 గంటల నుంచి 9.15 గంటల వరకు ఈ ఉత్సవం నిరవధికంగా సాగింది. 3 రథాలపై మూల విరాట్‌ల ఎదురుగా పాణకం బాణలు పగల గొట్టడంతో యాత్రకు సహకరించిన రథారూఢ దేవతులు, దృశ్య, అదృశ్య శక్తులకు కృతజ్ఞత పూర్వక నివేదన ముగిసింది. స్వామి కరుణాకటాక్షం ఈ వర్గాలకు ప్రాప్తించడం విశేషం. జగతి నాథుని దృష్టిలో అందరూ సమానమే అనే ప్రగాఢ నమ్మకం ఈ ఉత్సవం బలపరుస్తుంది.



రథంపైకి నిలువెత్తు బాణల తరలింపు

• బాణలు పగులగొట్టి..



మూల విరాట్‌ల ఎదురుగా సిద్ధం చేసిన నిలువెత్తు బాణలు

రథాలపై కనిపించే, కనిపించకుండా కొలువుదీరి రథ రక్షకులుగా యాత్రను దిగ్విజయం చేయడంలో తమవంతు సహకారం అందజేసిన దేవతలు, ఆత్మలు, ఇతర అదృశ్య శక్తులను విముక్తి చేయడానికి పాణకం బాణలను విచ్ఛిన్నం చేస్తారు. భగవంతుడు జగన్నాథుడు, దేవి సుభద్ర, బలభద్ర భగవానులను రక్షించడానికి రథయాత్రలో రథాలపై బసచేసిన దేవతలు, దేవతలకు మాత్రమే ఈ ఫలహారం వర్తిస్తుంది. రథాలపై పారలిన పాణకం సాధారణ భక్తజనం స్వీకరించడం నివారిస్తారు.

• సన్నాహాలు ఇలా..



బొడొ ఒడియా మఠంలో తయారవుతున్న త్రిముండి చందువా

రథాలపై సేవలు, ఉత్సవాలు, పూజాదులు పూర్తి చేసుకున్న జగన్నాథుడు యథాతథంగా రత్నవేదిక అధిష్ఠించేందుకు సిద్ధం అవుతున్నాడు. శనివారం నీలాద్రివిజే ఉత్సవంలో రథం నుంచి కిందకు దిగి.. రత్న వేదికకు చేరే సమయానికి సర్వం సిద్ధం చేసే ప్రయత్నంలో అంతా తలమునకలై ఉన్నారు. గర్భాలయంలో ఆసీనులైన మూల విరాటులకు పైకప్పు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా చేసేందుకు త్రిముండి చందువా(ప్రత్యేక తరహా ఉపరితళ పరదా) తయారు చేశారు. బొడొ ఒడియా మఠం దీనిని సిద్ధం చేసింది. దేవతామూర్తుల శిరస్సున రక్షణ కోసం వేర్వేరుగా 3 చందువాలను తయారు చేశారు. వీటిని సమగ్రంగా త్రిముండి చందువుగా పేర్కొంటారు.

దర్పదళనం పార్శ్వ దేవతలు



1. విమల
2. వనదుర్గ
3. వరాహి
4. చాముండ
5. భువనేశ్వరి
6. హర చండి
7. జయదుర్గ
8. సర్వ మంగళ
9. ఉగ్రతార

‘సత్వర చర్యలు చేపట్టాలి’



ఏడీఎంకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ మిలగాంగుడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఈనెల 26న గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ అదే మార్గంలో కాశీనగర్ సమితి ఖరడ గ్రామంలో జరగాల్సిన గ్రీవెన్స్‌కు వెళ్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. అధికారులను పిలిచి రోడ్డు నిర్మించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అయితే పనులు చేపట్టాల్సిన మార్గంలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలం ఉండటంతో ఆటంకం ఏర్పడిందని అధికారులు స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు శుక్రవారం మరోసారి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన సెలవులో ఉండటంతో అదనపు కలెక్టర్(రెవెన్యూ) బీరేంద్రకుమార్ దాస్‌కు వినతి పత్రం అందించారు. సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సుమంత్

పథకాల అమలుపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ త్రిపాఠి

రాయగడ: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం అర్హులకు చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం జరిగిన సమీక్షకు ఆయన అధ్యక్షత వహించారు. జిల్లాలోని 11 సమితులకు చెందిన బీడీఏలు వ్యవసాయ, నీటిపారుదల, వైద్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల పనులపై చర్చించారు. పేదలకు ఇళ్లు సమకూర్చే విషయంలో ప్రభుత్వం అమలు చేసిన మో ఘొరొ పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సాగునీటి కాలువలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

వివాదాలకు చెక్!

- బహనాగా బజార్ రైలు ప్రమాద మృతుల వివరాలపై గందరగోళం
- డీఎన్‌ఏ పరీక్షలతో 29మంది బాధిత సంబంధీకుల గుర్తింపు



భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వే స్టేషన్‌లో జూన్ 2న జరిగిన ఘోర రైలు ప్రమాదం జరిగిన నాలుగు వారాల తర్వాత డీఎన్‌ఏ పరీక్షల నివేదిక వెల్లడైంది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కోసం ఒకరి కంటే ఎక్కువ మంది ముందుకు రావడంతో వాస్తవ సంబంధీకుల వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో డీఎన్‌ఏ పరీక్షలకు ఆదేశించిన విషయం తెలిసిందే. 81 మృతదేహాల గుర్తింపు వివాదాస్పదం కావడంతో మొత్తం 88మంది నుంచి డీఎన్‌ఏ నమూనాలను సేకరించి, ఢిల్లీ లేబరేటరీకి పంపారు. ఈ నివేదిక అందేంత వరకు స్థానిక ఎయిమ్స్‌లోని కంటైనర్లలో ఆయా మృతదేహాలను భద్రపరిచారు. వీటిలో 29మంది పరీక్ష నివేదికలు అందాయని భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) మేయర్ సులోచన దాస్ శుక్రవారం తెలిపారు. మిగిలిన మృతదేహాల పరీక్ష నివేదికలు త్వరలో చేరుతాయన్నారు. గుర్తించిన 29మంది మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఈ సమాచారం అందించారు. ఐదుగురు తక్షణమే స్పందించి ఎయిమ్స్‌కు చేరుకున్నారు. గుర్తించిన మృతదేహాలను భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్, రైల్వే, ఒడిశా రవాణాశాఖ, ఎయిమ్స్ అధికారుల సమక్షంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఇతరులు త్వరలో వస్తారని మేయర్ వివరించారు.

ఉచిత సౌకర్యాలు..

మృతదేహాలను స్వగ్రామానికి తీసుకు వెళ్లాలనుకునే కుటుంబ సభ్యులకు ఒడిశా రవాణాశాఖ ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తోంది. ఎయిమ్స్ ప్రాంగణంలో దాదాపు 10 అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచినట్లు రవాణాశాఖ అధికారి తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరైనా భువనేశ్వర్‌లో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించుకుంటే, స్థానిక యంత్రాంగం భరత్‌పూర్, సత్యనగర్ శ్మశానవాటిక లలో వారికి అన్ని ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ కార్యవర్గ ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన భాస్కరరావును అభినందిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పడింది. గురువారం సాయంత్రం క్లబ్ సమావేశ మందిరంలో 48వ చార్టెడ్ నైట్ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా ఊళ్ల భాస్కరరావు, కార్యదర్శిగా ప్రతాప్ భౌరి, కోశాధికారిగా కె.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ పోస్ట్ డిస్టిట్ గవర్నర్ సురేష్ పాఢి ముఖ్య అతిథిగా హాజరై, కార్యవర్గాన్ని అభినందించారు. సుశ్రీత దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, లాడి చంద్రశేఖర్, సత్యవాది పతి, డాక్టర్ దుఖిశ్యాం దాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: చింతలవలస ఏపీఎస్‌పీ ఐదవ బెటాలియన్‌లో ఉన్న ఎస్‌వీఎస్ ఏపీఎస్‌పీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ ప్రైమరీ ఒకటి,1 నుంచి 5వ తరగతి వరకూ సైన్స్ టీచర్-1, 6 నుంచి 10వ తరగతి వరకూ సోషల్ టీచర్-1 అటెండర్, ఆయా 1 పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న వారు జూలై 7వ తేదీ లోగా దరఖాస్తుతో పాటు బయోడేటా, విద్యార్హతలను జత చేసి ఎస్‌వీఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అందజేయాలని తెలియజేశారు. డైట్,బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం పాఠశాల హెచ్‌ఎం అప్పారావు సెల్ నంబర్ 7013641401,అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.రామునాయుడు సెల్ నంబర్ 9573184185ను సంప్రదించాలని సూచించారు.

ముద్దాయికి ఎనిమిదేళ్ల జైలు శిక్ష

జామి: అసభ్యకర సందేశాలు, ఫొటో మార్ఫింగ్‌లతో ఒక మహిళను వేధింపులకు గురిచేసినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 8ఏళ్ల జైలు శిక్ష,రూ.40 వేలు అపరాధ రుసుం విధిస్తూ ఎస్.కోట జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.ఎస్.ఎస్.వాణి తీర్పునిచ్చారు. ఈ మేరకు ఎస్సై వీరబాబు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శిరికిపాలెం గ్రామానికి చెందిన కుంచంగి రఘు సార్ వేధింపులు తట్టుకోలేక 2016వ సంవత్సరంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ఈ మేరకు పోలీసులు ముద్దాయిని విశాఖ సెంట్రల్‌జైలుకు తరలించారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి చీపురుపల్లి రోడ్డులో తిమ్మయ్యపేట వద్ద ఆటో గురువారం రాత్రి రోడ్డుపై గోతిలో దిగడంతో అదుపు తప్పి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి జారిపడి గాయాలు పాలయ్యాడు. ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపిన వివరాలు.. మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన జినగం పార్వతీశం రాజాం వచ్చి పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు రాత్రి 10 గంటల సమయంలో ఆటోను ఆశ్రయించాడు. ఆటో స్పీడుగా వెళ్లడంతో పాటు గోతిలో దిగడంతో అదుపు తప్పి పడిపోయాడు. గాయాలతో రోడ్డుపై పడి ఉన్న పార్వతీశంను అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి రాజాం కేర్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో రెండు రోజుల క్రితం ప్రమాదాల బారిన పడి ఇరువురు వ్యక్తులు గాయాలపాలైన విషయం విదితమే.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆత్మారాముని అగ్రహారంలో నిర్వహిస్తున్న కోడి పందాలపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై నారాయణరావు శుక్రవారం తెలిపారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం ఏటీ అగ్రహారం గ్రామ శివారులో సోదాలు చేపట్టామన్నారు. నిందితుల నుంచి కోడి పుంజు, 22,610 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మృతుడి వివరాలు లభ్యం

బొండపల్లి: మండలంలోని బొండపల్లి గ్రామం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గురువారం మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వివరాలు శుక్రవారం తెలిసినట్లు రైల్వే ఎస్సై రవివర్మ తెలిపారు. మృతునిది మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావుగా తెలిసినట్లు చెప్పారు.

మృతుడికి భార్యదేవితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. కుటుంబసభ్యులు గుర్తించడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కళల కేంద్రం.. ఆకాశవాణి



ఆకాశవాణి 60వ వార్షికోత్సవంలో పాల్గొన్న కళాకారులు, శ్రోతలు


- జయపురం స్టేషన్ డైరెక్టర్ నరేంద్రనాథ్ పట్నాయక్

జయపురం: జయపురం ఆకాశవాణి కేంద్రం తన 60 ఏళ్ల కాలంలో శ్రోతలను ఆనందింప జేయడంతో పాటు ఎంతో చైతన్యం కల్పించిందని కేంద్రం డైరెక్టర్ నరేంద్రనాథ్ పట్నాయక్ తెలిపారు. అలాగే తన ప్రసారాలు, కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో ఎన్నో బహుమతులు సాధించిందని వెల్లడించారు. జయపురం ఆకాశవాణి ప్రారంభమై, 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం రాత్రి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయపురం కేంద్రం ప్రజలకు అందించిన కార్యక్రమాలను వివరించారు. శ్రోతల కష్టసుఖాలను తెలుసుకొని, తగిన సూచనలు అందించామన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమ, అనుబంధ రంగాల్లో ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఆకాశవాణి కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను తెలియజేసిన బొలంగీర్‌కు చెందిన నరేంద్ర నారాయణదాస్, జయపురానికి చెందిన పంకజలోచన మిశ్రా లను వేదికపై సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా జయపురం కళాకార మంచ్, జయపురం కళా కేంద్రానికి చెందిన కళాకారులు, గురు కనుచరణ్ ప్రధాన్ పర్యవేక్షణలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంజన్‌కుమార్ బెహరా, ఆకాశవాణి గాయకుడు దేవేంద్ర అధికారి, సనాతన పురోహిత దాస్, సూరజ్ ప్రధాన్, రాహుల్‌దేవ్ సామంతరాయ్, నిహారిక సాహు తమ మధుర గీతాలతో శ్రోతలను ఉర్రూత లూగించారు. ఉత్సవంలో పలువురు కళాకారులను సత్కరించారు.



కళాకారులను సత్కరిస్తున్న స్టేషన్ డైరెక్టర్ నరేంద్రనాథ్

పూరీ రత్న భాండాగారం తెరవాలి



పూరీ జగన్నాథాలయం..

- హైకోర్టులో సమీర్ మహంతి ప్రజాహిత వ్యాజ్యం దాఖలు
- మరమ్మతు చేపట్టేందుకు ప్రభుత్వానికి ఆదేశించాలని వివాదం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భండార్ తెరవాలని నలువైపుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నా రాష్ట్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీర్ఘకాలంగా ఈ వివాదం రగులుతోంది. రథయాత్ర పురస్కరించుకుని ఇటీవల సేవాయత్ వర్గం ఈ నేపథ్యంలో తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రశాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి ఒడిశా హైకోర్టులో దీనికి సంబంధించి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. రత్న భాండాగరం దుస్థితి పట్ల భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ), పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ ఆందోళన వ్యక్తం చేసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. భాండాగారానికి సమయోచిత మరమ్మతు, ఇతరేతర నిర్వహణ పనులు తరచూ చేపట్టడం అనివార్యమని గుర్తుచేశారు. అయితే దీర్ఘకాలంగా ఈ పనులు చేపట్టక పోవడంతో లోపలి మిద్దె బీటలు వారిందని, వర్షపునీరు సైతం ప్రవేశిస్తోందని వాపోయారు. దీనివల్ల ముప్పు సంభవించే పరిస్థితులు నివారించాల్సి ఉందన్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గజపతి మహారాజా, రాష్ట్ర హోం సెక్రటరీ, జగన్నాథ ఆలయ పరిపాలన(ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్, న్యాయశాఖ కార్యదర్శి, పూరీ కలెక్టర్, భారత పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్, సీబీఐ డైరెక్టర్ లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

గతంలోనూ ఇదే గందరగోళం..

రత్న భాండాగారం తాళం చెవి గల్లంతైందని గతంలో దుమారం రేపారు. కొద్దికాలం తర్వాత దొరికిందని వివాదానికి కొత్త మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలో అప్పటి పూరీ జిల్లా కలెక్టర్‌కు వ్యతిరేకంగా క్రిమినల్ కేసు నమోదు, సీబీఐ దర్యాప్తు జరిపించేందుకు హైకోర్టు అనుమతించాలని కోరారు. 2018 ఏప్రిల్ 4న భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ) నిపుణులతో సహా 16మంది సభ్యుల బృందం జగన్నాథుని రత్న భాండాగారం పటుత్వం పరిశీలించింది. దీని పరిస్థితి బలహీనంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. 2018 మార్చి 22న హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు నిపుణుల బృందం రత్న భాండాగారం లోపలి గదిని తెరిచేందుకు విఫలయత్నం చేసింది. ఈ బృందం తెరిచే సమయంలో తాళం చెవి గల్లంతైందని అధికార వర్గం ప్రకటించింది. దీంతో పెద్ద దుమారం రేగింది. తాళం చెవి లేకపోవడంతో హైకోర్టు ఉత్తర్వులు నిష్ప్రయోజనంగా మిగిలిపోయాయి. ఈ విచారకర పరిస్థితుల పట్ల విపక్షాలు, సేవాయత్ వర్గం ఇతరేతర వర్గాలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాయి.

జంట హత్యల కలకలం

- బరంపురం శివారు మౌడా గ్రామంలో ఘటన
- యువకులపై పెట్రోల్ పోసి, నిప్పంటించిన గ్రామస్తులు

బరంపురం: నగర శివారు మౌడా గ్రామానికి అనుకొని ఉన్న చెరువు వద్ద అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను గ్రామస్తులు అతి దారుణంగా హత్య చేశారు. ఒక్కసారిగా కలకం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బరంపురం జిల్లా దిగపండి పోలీసు స్టేషన్ పరిధి మౌడా గ్రామానికి చెందిన శివరామ్ గౌడ, లిట్టు రాజ్, మరికొందరు గ్రామస్తులతో వివాదానికి దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన వారంతా.. గౌడా, లిట్టు లపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అంతటితో ఆగకుండా యువకుల బైక్ నుంచి పెట్రోల్ తీసి, ఇరువురి ఒంటిపై చల్లడంతో పాటు నిప్పంటించారు. అతి దారుణంగా శరీర భాగాలు కాలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబాల సహకారంతో మృతదేహాలను గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం బరంపురం ఎంకేసీజీకి తరలించారు. జంట హత్యలకు సబంధించి ఇప్పటి వరకు 15మంది గ్రామస్తులను అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నామని ఎస్పీ వివరించారు. మిగతా వారి ప్రమేయంపై ఆరా తీస్తున్నామన్నారు.



బరంపురం: ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు



బరంపురం: మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సరవణ్ వివేక్

నిందితుడి అరెస్ట్..

పర్లాకిమిడి: జిల్లాలోని రాయఘడ పోలీస్ స్టేషన్ పరిధి బెతార్‌సింగి గ్రామ శివారులో ఉన్న కొండపై మణి భుయ్యాన్(50) అనే వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నట్లు డీఎఫ్ఎస్ఎల్ సిబ్బంది గుర్తించారు. దీనికి సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, అదే గ్రామానికి చెందిన నరేంద్ర శొబోరోను నిందితుడిగా గుర్తించి, అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి హత్యకు వినియోగించిన ఇనుప హుక్కును స్వాధీనం చేసుకున్నారు. అయితే మణి భుయ్యాన్‌ను ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందో తెలియలేదు. దీనిపై విచారణ కొనసాగిస్తున్నామని సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణ పతి వివరించారు.



పర్లాకిమిడి: ఘటనా స్థలంలో మణి భుయ్యాన్ మృతదేహం




పోలీసుల అదుపులో నిందితుడు నరేంద్ర శొబోరో

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



సంఘటనా స్థలంలో మృతిచెందిన రాజు



క్లీనర్ అప్పలరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: నగరంలోని కోట జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పూల్‌బాగ్‌కు చెందిన ఎస్.రాజు (29) గురువారం రాత్రి సెకెండ్ షో అనంతరం 1.30 ప్రాంతంలో స్నేహితుడితో కలిసి కోట జంక్షన్‌కు వచ్చేసరికి బైక్ స్కిడ్ అవ్వడంతో రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో రాజు తల రోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి త్యాగరాజు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కింద పడి క్లీనర్..

సాలూరు: మున్సిపాలిటీలోని వేంకటేశ్వర కాలనీకి చెందిన లారీ క్లీనర్ ప్రమాదవశాత్తు తాను పని చేస్తున్న లారీ కింద పడి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లారియూనియన్ ఆఫీసు ఎదురుగా అప్పుడే ముందుకు కదులుతున్న లారీని ఎక్కేందుకు క్లీనర్‌గా పనిచేస్తున్న అప్పలరాజు ప్రయత్నిస్తున్న క్రమంలో అదుపు తప్పి జారిపడిపోయాడు. దీంతో లారీ చక్రం కిందకు వెళ్లిపోవడంతో నలిగిపోయి అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస రావు తెలిపారు.

సెంచూరియన్‌లో నైపుణ్యంతో కూడిన బోధన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు, తదితరులు

- యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నైపుణ్యంతో కూడిన బోధన ఉంటుందని ఆ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. ఈ మేరకు మండలంలో టెక్కలి సెంచూరియన్‌లో నూతన కార్యవర్గం బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో పాత పద్ధతుల్లో కాకుండా ఆచరణాత్మక విధానంలో బోధన ఉంటుందని చెప్పారు. ఇతర విశ్వ విద్యాలయా లకు భిన్నంగా నైపుణ్యాలను అలవర్చుకునేలా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులు సెంచూరియన్‌లో పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. వర్సిటీని ఏర్పాటు చేయాలని ఇతర రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ గోపురాలు తయారు చేసేందుకు ఆస్ట్రేలియా నుంచి సంబంధిత పరిశ్రమ ప్రతినిధులు ముందుకొచ్చారన్నారు. ఇక్కడ తయారు చేసిన గోపురాలను ఇతర దేశాలకు ఎగుమతి చేయనున్నామని వివరించారు. ఇక నుంచి చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వైస్ చాన్స్‌లర్‌గా పీకే మహంతి, రిజిస్ట్రార్‌గా డాక్టర్ పల్లవి కొనసాగనున్నారని స్పష్టం చేశారు.

ప్రాణం తీసిన అతివేగం



ఘటనా స్థలంలో మృతదేహాలు

- చెట్టుని ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి

కొరాపుట్: అతివేగం ముగ్గురి ప్రాణలు బలిగొంది. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న కారు.. చెట్టుని ఢీ కొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. నవరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ డివిజన్ జొరిగాం రోడ్డులోని బసిని గ్రామం వద్ద శుక్రవారం వేకువజామున విషాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఉమ్మర్‌కోట్ ప్రాంతంలో ఉన్న బెంగాలీ శరణార్థ గ్రామం యూకీ-8కి చెందిన మహిళ తెరువతి వ్యాపారి(40)కి ఆరోగ్యం క్షీణించింది. ఉన్నత చికిత్స కోసం సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి జగదల్‌పూర్‌కు కారులో తీసుకు వెళ్లి, తిరిగి వస్తున్నారు. వేకువజామున ఇంటికి త్వరగా చేరుకోవాలనే ఆరాటంతో డ్రైవర్ వేగంగా వాహనాన్ని నడిపాడు. ఈ క్రమంలో అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో రాయిఘర్ సమితి సానేపూర్‌కు చెందిన గౌరంగ రాయ్(35), చొత్తాబెడకు చెందిన సురేష్ మండల్(40), యూవీ-8కు చెందిన సత్యరంజన్ వ్యాపారి(45) అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద శబ్దం విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకునే సరికే ముగ్గురూ విగత జీవులుగా మారారు. తెరువతి వ్యాపారి(40) తీవ్ర గాయాలతో బయట పడగా, ఆమెను నవరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రమాద తీవ్రత, కారు నుజ్జయిన పరిస్థితి చూస్తే మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతులంతా బెంగాలీ శరణార్థులు కావడం గమనార్హం.



నుజ్జయిన కారుని పరిశీలిస్తున్న స్థానికులు

హత్య చేసి.. హత్యకు గురై..!



మృతుడు రాజేష్

- కిరాయి ఇచ్చిన వ్యక్తుల చేతిలో ఒడిశా వాసి హతం
- గండిగుండానికి సమీపంలో మృతదేహం వెలికితీత
- కుళ్లిపోయేందుకు 25 కిలోల ఉప్పు వాడిన నిందితులు
- ఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం

ఆనందపురం: కిరాయికి హత్య చేసిన వ్యక్తే.. కిరాయి ఇచ్చిన వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. ఒడిశాకు చెందిన వ్యక్తిని హత్య చేసి గండిగుండానికి సమీపంలో కొండపై గల కందకంలో పడేయగా ఆనందపురం పోలీసుల సాయంతో ఒడిశా పోలీసులు దర్యాప్తు జరిపి కేసును ఛేదించారు. శుక్రవారం వెలుగు చూసిన సంఘటన వివరాలివీ.. ఒడిశా రాష్ట్రం గుణుపురం ప్రాంతానికి చెందిన రాజేటి కృష్ణ, అతని బావమరిది గోవింద్, వడ్డాది రాజేష్ అలియాస్ రాజా స్నేహితులు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కృష్ణ, ఒడిశాలోని గుణుపురానికి చెందిన సమాజ సేవకుడు గౌరీప్రసాద్ మిశ్రాల మధ్య భూ తగదాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కృష్ణ గతేడాది నుంచి వ్యాపారం నిమిత్తం విశాఖలోనే ఉంటున్నాడు. ఇటీవల కృష్ణ, గౌరీప్రసాద్‌ల మధ్య వివాదాలు మరింత ఎక్కువయ్యాయి. దీంతో ప్రసాద్‌ను మట్టు బెట్టాలని కృష్ణ పథకం వేశాడు. తన బావమరిది గోవింద్‌తో కలిసి మిత్రుడైన రాజేష్‌తో ఈ విషయంపై చర్చించాడు. అంతా అనుకున్నట్లు జరిగితే రూ.15 లక్షలు ఇస్తానని బేరం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు అందుకున్న రాజేష్.. మే13న గౌరీప్రసాద్ మిశ్రాను ఒడిశాలోనే తుపాకీతో కాల్చి హతమార్చాడు. అనంతరం పరారయ్యాడు.

తల్లికి ఫోన్ చేయడంతో..

హత్యానంతరం తనకు రావాల్సిన రూ.13 లక్షల సుపారీ సొమ్మును ఇవ్వాలని రాజేష్ తరచూ కృష్ణను అడగడం మొదలుపెట్టాడు. ఎంతకూ ఇవ్వక పోవడంతో హత్య ఘటన విషయం పోలీసులకు చెబుతానని బెదిరించాడు. అదే సమయంలో గౌరీప్రసాద్ హత్య కేసును పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేస్తున్నారు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన కృష్ణ.. రాజేష్ అడ్డు తొలగించుకుంటే డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, కేసు నుంచి బయట పడవచ్చని భావించాడు. ఈ మేరకు విశాఖపట్నం వస్తే మిగతా రూ.13 లక్షలు చెల్లిస్తానని నమ్మబలికాడు. దీంతో ఈనెల 19న రాజేష్ రైలులో విశాఖపట్నం చేరుకున్నాడు. ముందుగా రాజేష్‌ను బెదిరించిన రాజేష్, కృష్ణ.. అతను ఎంతకీ లొంగక పోవడంతో పార్టీ చేసుకుందామని చెప్పి గండిగుండం వైపు తీసుకువెళ్లారు. ఈలోగా రాజేష్ బెంగళూరులో ఉంటున్న తన తల్లి లక్ష్మీకి ఫోన్ చేసి, వారిద్దరూ బెదిరిస్తున్నారని.. భయంగా ఉందని చెప్పాడు. అప్పటి నుంచి రాజేష్ ఫోన్ పనిచేయక పోవడం, అతని నుంచి ఎటువంటి సమాచారం లేక పోవడంతో లక్ష్మి ఈనెల 25న గుణుపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కుళ్లిపోయే దశలో..

ఈ మేరకు కేసు నమోదు చేసిన ఒడిశా పోలీసులు.. కృష్ణ, గోవిందలను అదుపులోకి తీసుకుని విచారించారు. తామే రాజేష్‌ను హతమార్చినట్లు వారు అంగీకరించారు. రాజేష్‌కు మద్యం తాగించి, తాడుతో ఉరివేశామని, అనంతరం ఆనందపురం మండలంలోని గండిగుండం శివారు కంబాల కొండపై 10 అడుగుల లోతులోని కందకంలో మృతదేహాన్ని పూడ్చి పెట్టామని ఒప్పుకున్నారు. హత్య చేసిన 2రోజుల తరువాత మరోసారి అక్కడకు వెళ్లి, మృతదేహం త్వరగా కుళ్లి పోయేందుకు 25కిలోల ఉప్పు చల్లడంతో పాటు మట్టితో పూడ్చామని వివరించారు. ఈ మేరకు నిందితుడు కృష్ణను తీసుకుని ఘటనా స్థలానికి శుక్రవారం తీసుకు వెళ్లిన పోలీసులు.. కుళ్లిపోయిన దశలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీశారు. రాజేష్ తల్లి లక్ష్మి, భార్య మంగ గుర్తుపట్టిన అనంతరం భీమిలి ఆస్పత్రి వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు జరిపారు. ఆనందపురం సీఐ రామచంద్రరావు, ఎస్ఐ నర్సింహమూర్తి కేసు దర్యాప్తులో ఒడిశా పోలీసులకు సహకరించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

న్యూస్‌రీల్

శాకంబరిగా భగవతీ దేవి



శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు

పోలాకి: దీర్ఘాశిలోని దుర్గాగిరిలో భగవతీదేవి అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు జడా చిన్నారావు ఆధ్వర్యంలో కూరగాయలు మాలలుగా కట్టి, ప్రత్యేక అలంకరణ చేశారు. పురాతన అమ్మవారి ఆలయం కావటంతో ఏటా ఇక్కడ ఆషాడమాసంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు జరుగుతాయి.

వర్సిటీకి నేడు సెలవు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి శనివారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య చెప్పారు. గత నెల 25న వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం పనిదినంగా పరిగణించటం వల్ల సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

24 మంది కాంట్రాక్టు బోధకుల సేవలు నిలుపుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 24 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకుల సేవలు నిలుపుదల చేస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా 2017 డిసెంబర్ నుంచి 2020 డిసెంబర్ మధ్య నియమితులయ్యారు. ఈ టర్మ్‌లో ప్రొఫెసర్ కూన రామ్‌జీ వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. ఏడాది పాటు పనిచేసేందుకు వీరిని అప్పట్లో నియమించారు. అనంతరం రెన్యువల్ చేస్తూ వచ్చారు. మరో పక్క అప్పట్లో నియామకాలు, ఇంటర్వ్యూల్లో రూల్ ఆఫ్ లా పాటించలేదని కొందరు ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు సైతం చేశారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్‌లో 18 మంది, ఆరుగురు నాన్ ఇంజినీరింగ్‌కు సంబంధించి సేవలు నిలిపివేశారు. త్వరలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఈ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. తొలగించిన వారికి వ్యక్తిగతంగా సమాచారం తెలియజేయాల్సి ఉంది.

పింఛన్లు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుకను శనివారం ఉదయం నుంచి లబ్ధిదారులకు అందజేయనున్నారు. జిల్లాలో ఈ నెలకు గాను అన్ని రకాల పింఛన్లు కలిపి 3,12,673 మందికి అందజేస్తారు. రూ. 84.70 కోట్లు ఈ నెలకు నిధులు విడుదలయ్యాయని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు.

జాతీయ స్థాయి ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ విద్యా సంవత్సరానికి గాను జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హులైన టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. జూలై 15వ తేదీలోగా నేషనల్‌అవార్డ్స్‌టీచర్స్.ఎడ్యుకేషన్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలను, తగిన కాపీలను అప్‌లోడ్ చేసి నేరుగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని డీఈఓ స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

డయల్ యువర్ యూనివర్సిటీ వాయిదా




ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమం వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. పరిపాలన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ పాలనా పరమైన కారణాల వల్ల వాయిదా వేశామని, తదుపరి తేదీ త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో 2015-17వ సంవత్సరంలో పనిచేసిన ప్రిన్సిపాల్ ఎం.మధుసూదనవర్మపై రెండు ఫిర్యాదు లు రావడంతో ఆయనపై విచారణ చెపట్టారు. అప్పులు, జీతాలకు సంబంధించి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఆర్‌జేడీ, రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.కృష్ణ, ఆర్‌జేడీ కార్యాలయం ఏవో రాజులు శుక్రవారం స్థానిక కళాశాలలో ఈ విచారణ నిర్వహించారు.

థ్యాంక్యూ డాక్టర్..!

● నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



ఊరి చివర ఆలయం ఓ నమ్మకం.. అదే ఊరి చివర ఆస్పత్రి ఓ ధైర్యం. అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధ పడుతున్న గర్భిణి, బొడ్డుతాడు మెడలో వేసుకున్న పసిగుడ్డు, ప్రమాదంలో తల పగిలిన యువకుడు.. వీళ్లంతా మొక్కేది దేవుడినే కాదు వైద్యులను కూడా. అందుకే ఎన్ని ఆస్పత్రులు ఉంటే ఆ ఊరికి అంత ఆయుష్షు పెరుగుతుంది. ఎంత మంది డాక్టర్లుంటే అక్కడ అంత తక్కువ వేదన ఉంటుంది. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రేయింబవళ్లు శ్రమిస్తున్న శ్వేతవస్త్ర ధారులకు కృతజ్ఞత చెప్పాల్సిన రోజు. నిండు నూరేళ్లు చల్లగా బతకాలి.. అని గుండెతో దీవించాల్సిన రోజు.

అరసవల్లి:



సిక్కోలు డాక్టర్ల హబ్‌గా మారుతోంది. 1980ల కాలంలో వేళ్ల మీద లెక్కించేంత మందే ఇక్కడ వైద్యులుగా ఉండేవారు. కానీ ఇప్పుడు జిల్లాలోని మూడు మెడికల్ కాలేజీల్లో ఏటా వందలాది మంది రిలీవవుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా వైద్యులుగా ఇక్కడకు వచ్చి స్థిరపడుతున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఒక్కొక్కటిగా జిల్లాకు వస్తున్నాయి. వైద్యవిద్య ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలోనే మన జిల్లాకు చెందిన పోలాకి కుర్రాడికి ఏకంగా ఫస్ట్ ర్యాంకు సాధించాడు.

ఊరూరా వైద్యులే..

గతంలో ఎన్నడూ చూడని విధంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లో భాగంగా 'ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్'ను ప్రవేశపెట్టి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించే చర్యలు చేపట్టింది. గత ఆరునెలలుగా ఈ విధానం అమలులో దాదాపుగా 2 లక్షల మందికి వివిధ రకాలుగా వైద్య సేవలందించారు. జిల్లాలో ఉన్న 30 మండలాల్లో సచివాలయాల వారీగా రోజూ ఉదయం ఓపీ చూసి, మధ్యాహ్నం ఇంటికే పరిమితమైన రోగులను చెక్ చేసేలా ఈ విధానం అద్భుత ఫలితాలనే చూపిస్తోంది. ఇక రిమ్స్ నుంచి పీహెచ్‌సీల వరకు అన్ని చోట్లా కావాల్సినంత మంది సిబ్బందిని కేటాయిస్తున్నారు.

హృదయానికి దగ్గరగా సేవలు



నాన్న సీతారాం ప్రోత్సాహం, పోలాకి మండలం ఉర్జాం గ్రామ ప్రజల మమకారంతోనే వైద్య వృత్తిని చేపట్టాను. వైద్య వృత్తిలో పీజీ చేసి కిమ్స్ ఆస్పత్రిలో కార్డియాలజీ వైద్యునిగా పనిచేస్తున్నాను. అయితే ప్రతి రోగి హృదయ స్పందనను తెలుసుకుంటూ వారి భయాందోళనను తగ్గించి..మెరుగైన వైద్యాన్ని అందించి..వారి జీవిత కాలాన్ని పెంచే అదృష్టం ఈ వృత్తిలో ఉంది. ప్రముఖ వైద్యులు కృష్ణప్రసాద్, శేషగిరిరావుల సూచనలు నా వైద్య వృత్తిలో ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. అలాగే కోవిడ్ సమయంలో వందలాది మందిని రక్షించేలా సేవలందించడం నా జీవితంగా మరచిపోలేని క్షణాలుగా ఫీలవుతాను.

– డాక్టర్ కిల్లి సతీష్, కిమ్స్ కార్డియాలజీ.

విదేశాల్లో చదివినా..



చిన్నప్పుడు నా సొంత ఊరు కవిటి రాజపురంలో వైద్యం అందని పరిస్థితులను చూసి అప్పటి నుంచే డాక్టర్ చదువే లక్ష్యంగా విదేశాలకు వెళ్లి చదివాను. అయినా మన జిల్లాలోనే వైద్య సేవలందించాలనే ఏకైక లక్ష్యంతో ఇక్కడే ప్రాక్టీస్ మొదలుపెట్టాను. 2008లోనే తొలి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా కిమ్స్ ప్రారంభంలో భాగస్వామ్యం వహించడం ఎంతో ఆనందానిచ్చింది. అలాగే ఇటీవల తొలిసారిగా ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ (స్పెయిన్)తో మెడికవర్ ప్రారంభించడం, జిల్లాలో మొదటిగా ఐవీఎఫ్ వైద్యం చేయించడం ఆనందాన్నిచ్చే క్షణాలు. జిల్లా వాసుల కోసం తెల్లరేషన్ కార్డులున్న డ్వాక్రా మహిళలకు ఉచితంగా ఓపీ ప్రవేశంతో పాటు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య, మంచినీటి సరఫరా తదితర కార్యక్రమాలను చేపట్టడం ఎంతో సంతృప్తినిస్తోంది.

– డాక్టర్ దానేటి శ్రీధర్, మెడికవర్ హాస్పటల్.

సామాజిక బాధ్యతగా..



గ్రామీణ పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తుంటాను. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో పట్టణాలకు వచ్చి వైద్యం చేయించుకోలేని పేదల చెంతకు వెళ్లి వైద్య సేవలు అందించడం గొప్పగా ఫీలవుతుంటాను.

– డాక్టర్ భేరి రేవతి, వైద్యాధికారి, కొళిగాం, ఇచ్ఛాపురం మండలం

13 ఏళ్లుగా సేవా ప్రయాణం



పలాస దగ్గర మహాదేవిపురంలో పుట్టిన నేను.. ఆ ప్రాంతం నుంచి తొలి వైద్యునిగా గుర్తింపు పొందడం మరచిపోలేనిది. వైద్య వృత్తి గొప్పతనాన్ని చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు తమ్మయ్య,లోలాక్షిలు వివరించి చెప్పడంతో ఈ వృత్తిని ఎంచుకున్నాను. గత 13 ఏళ్లుగా జిల్లాలోనే సేవలందిస్తూ..జిల్లా ప్రజల ఆశీస్సులు పొందాను. భార్య శైలజ కూడా డాక్టర్ (న్యూరో) కావడంతో ఇక్కడే ఇద్దరం సేవలందిస్తున్నాం.

– డాక్టర్ తమ్మినేని వేణుగోపాల్, అమృత హాస్పటల్

దేవునికి కృతజ్ఞతలు



కోవిడ్ కాలంలో వైద్యులతో పాటు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన విధానాలతో ఎన్నో వేలాది మంది ప్రాణాలతో బయటపడ్డారు. వ్యాక్సినేషన్‌తో చాలావరకు విపత్తు నుంచి రక్షణ పొందారు. వైద్య వృత్తిని చేపట్టి ప్రాణాలను కాపాడే అవకాశం ఇచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు. కోవిడ్ సమయంలో వాడిన స్టెరాయిడ్‌లతో ప్రస్తుతం ఎందరికో బీపీ, షుగర్, గుండెపోటు తదితర లక్షణాలు కనిపిస్తున్నాయి. వైద్య వృత్తిలో నా గురువులు డాక్టర్లు కె.వెంకటేశ్వర్లు, వి.రామనర్సింహంల స్ఫూర్తితో జిల్లా కేంద్రంలోనే గత 18 ఏళ్లుగా ప్రాక్టీస్ కొనసాగిస్తున్నాను.

– డాక్టర్ మనోజ్, ద్వారకామయి హాస్పిటల్

ఏజెన్సీ ప్రాంత పరిస్థితులే వైద్యున్ని చేశాయి



సీలేరు ప్రాంతంలో ప్రాథమిక అభ్యాసం నుంచి అక్కడ పరిస్థితులు నన్ను వైద్యుడిని చేసేలా ప్రభావితం చేశాయి. మా గురువులు డాక్టర్ వి.నారాయణరావు, పి.శివానంద వారి సూచనల మేరకు ఉన్నత వైద్యవిద్యను అభ్యసించి, ఆర్థోపెడిక్ వైద్యునిగా స్థిరపడ్డాను. జిల్లాలో సిరి సంజీవని హాస్పటల్‌లో గత కొన్నేళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నాను. డాక్టర్ బీసీ రాయ్ స్ఫూర్తిగా దేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయి.

– కె.సంజీవ్‌కుమార్, ఆర్థోపెడిక్ వైద్యుడు

● గుండె నిండా ఆనందంతో..



ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేయాలని కలలు కన్నారు. సర్వశక్తులూ ఒడ్డి సాధన చేశారు. పరీక్షలన్నింటినీ ఎదుర్కొన్నారు. అన్నీ సఫలమై ఉద్యోగం చేతికి వస్తోందనగా.. దురదృష్టం ఆయనను వెంటాడింది. నాటి ప్రభుత్వ వైఖరి, ఆ తర్వాతి సర్కార్ల అలసత్వం కలగలిపి పాతికేళ్ల పాటు ఆయనకు ఎదురుచూపులే మిగిలాయి. యువకుడిగా డీఎస్సీ రాసిన ఆయనకు పాతికేళ్ల తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో టీచర్ ఉద్యోగం వచ్చింది. తన చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకునేందుకు వచ్చిన అవకాశాన్ని ఆయన గుండెకు హత్తుకున్నారు. నెల రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రిటైరయ్యారు. మండలంలోని చీడిపూడి ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న తర్ర కృష్ణారావు కథ ఇది. కృష్ణారావు ఏప్రిల్‌లో 13 రోజులు విధులు నిర్వర్తించి మళ్లీ పాఠశాలలు పునః ప్రారంభమైన తర్వాత జూన్ నెల 12న విధుల్లో చేరారు. వయసు 60 దాటడంతో శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా తోటి గురువులు ఆయనను సత్కరించారు. సీఎం నిర్ణయం వల్లనే తన స్వప్నం సాకారమైందని కృష్ణారావు సంతోషం వ్యక్తం చేశారు.

– సారవకోట

గిరిజన ఆశ్రమ పాఠశాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో పరిశీలించడంతో సమస్యలు బయట పడ్డాయి. వంటగది, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు, మినరల్ వాటర్ పరికరం, తాగునీటి ట్యాంక్, భోజన మెనూ, అందిస్తున్న నాణ్యత లేని భోజనం అన్నీ పరిశీలించారు. ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంతో వార్డెన్, హెచ్‌ఎంలను సస్పెండ్ చేస్తామన్నారు. కారణం లేకుండా ఇంగ్లిష్ టీచర్‌కు సెలవు ఇచ్చినట్లు గుర్తించారు. హెచ్‌ఎం క్వార్టర్స్‌లో కాకుండా పాతపట్నంలో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. మెనూ పాటించడం లేదని విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నా రు. తాగునీటి నమూనాను తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. తహసీల్దార్ సరోజిని మాట్లాడుతూ సమస్యలు చెబుతున్న పిల్లలను భయపెడుతున్నట్లు సబ్ కలెక్టర్‌కు తెలిపారు.

ఉద్ధృతంగా దాడులు.. ముమ్మరంగా కేసులు

- గంజాయి అక్రమ రవాణా అరికడుతున్నాం
- యువత మత్తు వీడాలి
- 'సాక్షి'తో ఎస్పీ జీఆర్ రాధిక



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గంజాయి క్రయవిక్రయాలు ఆపేందుకు దాడులు నిర్వహిస్తున్నామని, నిందితులపై కేసులు కూడా కడుతున్నామని, రానున్న రోజుల్లో అనుమానితులపై సస్పెక్ట్ షీట్స్ కూడా తెరుస్తామని ఎస్పీ జీఆర్ రాధిక 'సాక్షి'కి తెలిపారు. ఒక్క ఏడాదిలోనే గంజాయికి సంబంధించి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో వారు రెండు కేసులు నమోదు చేయగా లాఅండ్‌ఆర్డర్ పోలీసులు 11 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ వారం రోజుల్లో ఇచ్ఛాపురం కేంద్రంగా చేసుకుని రెండు చోట్ల 157.5 కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. నిందితులను కూడా అరెస్టు చేశామన్నారు. చిన్న చిన్న ప్యాకెట్లు (గంజా) విక్రయించే వారిపై పూర్తి నిఘా ఉంచామన్నారు. గంజాయితో పాటు ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కేసుల్లో 18 సస్పెక్ట్ షీట్లు తెరిచామని పేర్కొన్నారు. గంజాయికి బానిసలైన వారికి కౌన్సెలింగ్ చేస్తామని, తల్లిదండ్రులను పిలిచి మాట్లాడుతామని, అప్పటికీ మారకపోతే షీట్స్ తెరుస్తామన్నారు.

శ్రీకాకుళం నగరంలో కొన్ని ప్రాంతాల్లో గంజాయి వాడుతూ దాడులకు దిగుతున్నారన్న సమాచారంపై పూర్తి నిఘా పెట్టామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై, వారు చేసే నేరాల తీవ్రతను బట్టి తప్పక రౌడీషీట్ తెరుస్తామన్నారు. 60 ఏళ్లు నిండిన వారిపై, సత్ప్రవర్తన కలిగి ఎలాంటి నేర కార్యకలాపాల్లో పాలుపంచుకోని పాత నేరస్తులపై రౌడీషీట్ ఎత్తివేస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. యువత ఇప్పటికైనా మత్తును వీడి సన్మార్గంలో నడవాలని హితవు పలికారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్:



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు. ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రావ్ – 2023 పేరిట రెండు రోజుల టెక్నికల్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నత విద్యలో అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. నూతన విద్యావిధానం అమలు నేపథ్యంలో ఆవిష్కరణలు, పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ పంటల బీమా జమ



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జూలై 8న వైఎస్సార్ జయంతి, రైతు దినోత్స వం నాడు జిల్లాలో అతి తక్కువ దిగుబడులు వచ్చిన గ్రామాలను యూనిట్‌గా తీసుకుని రైతుల ఖాతా ల్లో డబ్బులు జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల, ప్రధానమంత్రి ఫసల్‌బీమాయోజన ఈకేవైసీ ఆధారంగా జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. వరి పంట దిగుబడి అంచనా ప్రకారం ఎచ్చెర్ల మండలంలోని ఫరీద్‌పేట, కేశవరావుపేట, కొంగరాం, ఎస్.ఎం.పురం ఆర్‌బీకేల పరిధిలో 1094 మంది రైతులకు గాను రూ.31.73 లక్షలు జమ కానుందని వివరించారు.

ప్రాణం తీసిన సరదా



మృతదేహాన్ని బయటకు తెస్తున్న రెస్క్యూ టీం (ఇన్‌సెట్లో) సంతోష్ (ఫైల్)

● నదిలో దిగి యువకుడు మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: నదిలో సరదాగా స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం గాజులవీధికి చెందిన స్నేహితులు ముసలగంటి సంతోష్ (32), మౌళి శుక్రవారం పొన్నాడ వంతెన సమీపంలోని నాగావళి నదిలో స్నానానికి దిగారు. స్నానం చేశాక మౌళి ఒడ్డుకు చేరగా, మరోసారి లోపలికు వెళ్లి వస్తానని వెళ్లిన సంతోష్ నీటి ప్రవాహంలో చిక్కుకున్నాడు. దీంతో స్నేహితులు, స్థానికులు అత్యవసర సేవల టోల్ ఫ్రీనంబర్లుకు సమాచారం ఇచ్చారు. శ్రీకాకుళం పట్టణ రెస్క్యూ టీం గాలించి బయటకు తీసేసరికి సంతోష్ మృతి చెందాడు. అవివాహితుడైన సంతోష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రప్రభుత్వం ఇటీవల జరిపిన ఉపాధ్యాయ బదిలీల్లో స్థానచలనం పొందిన ఉపాధ్యాయులకు నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ ముఖ్య ప్రతినిధులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు, కుప్పన్నగారి శ్రీనివాసరావులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. బదిలీ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపుల్లో అనేక అడ్డంకులు ఉన్నాయని చెప్పారు. జిల్లా క్యాడర్ స్ట్రెంత్ జిల్లా ఖజానాకు చేరని కారణంగా జూన్ జీతాలు నిలిచిపోయాయని తెలిపారు. రీ అపోర్షన్ పోస్టులకు బదిలీపై వెళ్లిన వారికి మరిన్ని ఇబ్బంది తలెత్తినట్లు వివరించారు. నెలజీతం మీద ఆధారపడే అనేకమంది ఉపాధ్యాయులకు జీతాలు పడక ఈఎంఐలు, ఇంటిపోషణకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జి.మేరీప్రసాద్, సీహెచ్.జనార్దనరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.మీనాకుమారి, ఆర్.సంధ్యారాణి, జి.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం రేపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 2న నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయాచారి, ప్రధాన కార్యదర్శి దేవర కొండ షణ్ముఖరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలోని కంపోస్టు కాలనీ (జ్యోతిరావు పూలే కాలనీ)లో విశ్వబ్రాహ్మణ కమిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని నియోజకవర్గాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

వైద్యారోగ్య శాఖ ఏఓగా పైడి వెంకటరమణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ)గా పైడి వెంకటరమణను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం ఈయన మాస్‌మీడియా అధికారిగా ఇదే కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఏవోగా గత ఏడాది సువర్ణ అనే గ్రూప్–1 అధికారిని నియమించినప్పటికీ ఏడాది పాటు ఆమె శిక్షణలో ఉన్నందున..తాత్కాలికంగా వెంకటరమణకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షిని ఆయన గౌరవపూర్వకంగా కలిశారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని తీర్మానం

సంతబొమ్మాళి: మూలపేట పోర్టులో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలంటూ శుక్రవారం జరిగిన సంతబొమ్మాళి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉద్యోగ నియామకాలు సక్రమంగా జరిపేందుకు కంపెనీ, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాలు, యువజన, మహిళా, పాత్రికే య సంఘాలతో నియామకపు బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని భావనపాడు సర్పంచ్ బి.మోహన్‌రెడ్డి సభలో ప్రవేశపెట్టారు. అనంతరం తీర్మాన ప్రతిని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయ కర్త దువ్వాడ వాణికి అందజేశారు. ప్రభుత్వం, పోర్టు కాంట్రాక్టర్ విశ్వసముద్ర దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. టెక్క లి నియోజకవర్గ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇప్పించాలని విన్నవించారు.